క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం



బాదంపూడిలో సెక్టారు సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: పౌష్టికాహారంతో పాటు విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటల ద్వారా అందజేస్తామని బాదంపూడి అంగన్‌వాడీ సూపర్‌వైజరు శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ప్రజల భాగస్వామ్యంతో అంగన్‌వాడీ కేంద్రాలు కార్యక్రమంలో మండలంలో నిర్వహించారు. చేబ్రోలులో సెక్టారు సూపరు వైజరు శారదామని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రందే లక్ష్మీసునతీ పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రాథమిక పాఠశాలలో చేర్పించే కార్యక్రమం నిర్వహించారు.

నిబంధనలు పాటించని రియల్ వ్యాపారికి నోటీసు



ఉంగుటూరు ప్రైవేటు లేఅవుట్‌లో ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన పంచాయతీ ఉద్యోగులు

ఉంగుటూరు: కొత్త ఉంగుటూరులోని ఓ ప్రైవేటు లేఅవుట్‌లో నిబంధనల పాటించకపోవడంతో అధికారులు కన్నెర్ర చేశారు. లేఅవుట్ యాజమాన్యం సామాజిక స్థలం కేటాయించకుండా, 10 మీటర్ల మేర రహదార్లు లేకుండా, అనుమతులు తీసుకోకుండా లేఅవుట్ వేయడంతో పంచాయతీ కార్యదర్శి గిరిధర్, ఉద్యోగులు ఆ స్థలంలో మంగళవారం హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. లేఅవుట్‌కు సంబంధించిన దండు ప్రభాకరరాజుకు నోటీసులు ఇచ్చారు. నారాయణపురానికి చెందిన గురువెల్లి ప్రసాదు స్పందనలో ఫిర్యాదుచేయడంతో పంచాయితీ అధికారులు ఈ చర్యలకు ఉపక్రమించారు.

బిందు సేద్యం వైపు రైతుల మొగ్గు



జగన్నాథపురంలో బిందు సేద్యం

పెదవేగి : సాగుకు అధిక సంఖ్యలో బిందు సేద్యంపై రైతులు మొగ్గుచూపుతున్నారు. మండలంలోని జగన్నాథపురంలో అధిక విస్తీర్ణంలో రైతులు బిందుసేద్య పద్ధతిలో సాగు చేస్తున్నారు. దీనికి తోడు అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం అధిక శాతం సబ్సిడీపై డ్రిప్‌లను అందిస్తోంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఆశాజనకంగా ఉంటాయో లేక నిరాశపరుస్తాయో తెలియని అయోమయ స్థితిలో ఉన్నందున మొక్కజొన్నకు అధిక శాతం బిందు సేద్య విధానానికి మొగ్గు చూపామన్నారు. దీంతో నీరు వృథా కాకుండా సక్రమంగా మొక్కను సంరక్షించవచ్చని అన్నదాతలు తెలిపారు.

ఆట పాటలతో కూడిన విద్యతో మనో వికాసం

భీమడోలు: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా వారిలో మనోవికాసం వృద్ధి చెందుతుందని భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని కేవీ విజయలక్ష్మీ అన్నారు. గుండుగొలను కోడ్‌-25 వద్ద, కురెళ్లగూడెం గ్రామ పంచాయతీల్లో మంగళవారం అంగన్‌వాడీ విద్య, ఆటపాటలతో విద్య అనే నినాదంతో జన్ భగీదారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తల్లులు, కిషోర బాలికలు గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. గుండుగొలను- 25 కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీవో కేవీ విజయలక్ష్మి మాట్లాడారు. కురెళ్లగూడెంలో సర్పంచ్ గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు, పోషకాహార కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రథమ్ కోఆర్డినేటర్ టి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ నాగనబోయిన వెంకటేశ్వరమ్మ సూపర్‌వైజర్లు నూర్జహాన్, కవిత, మహిళా పోలీస్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తల బి.రాజమణి, ఎఎన్ఎంలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం

దెందులూరు: దెందులూరులో రెండు ఎకరాల పామాయిల్ తోట దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని దగ్ధమైన ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. పెద్దిశెట్టి ఉమామహేశ్వరరావు, ప్రభాకర్‌కు చెందిన రెండున్నర ఎకరాల్లో ఉన్న పామాయిల్ పంటపై ఉండగా సమీప రైతు పొలంలోని వరిచేల దుబ్బులకు మంట పెట్టడంతో ఆ మంటలు వ్యాపించాయి. దీంతో ఆయిల్‌పామ్ తోట దగ్ధమైందని బాధిత రైతులు వివరించారని మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ తెలిపారు.

సీఎం జగనన్న పాలనను మెచ్చిన జనం



ఓ వృద్ధురాలిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన జనంమెచ్చిన పాలన అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. అంబర్‌పేట పంచాయతీ శివారు పాత అంబర్‌పేటలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వాసుబాబు వెళ్లి నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పాలన తదితర అంశాలను ప్రజలకు వివరించారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందుకున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ వారికి బుక్‌లెట్‌ను అందించారు. సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. గృహ నిర్మాణ బిల్లులు మంజూరు చేయాలని, కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, డ్రెయిన్లు నిర్మించాలని గ్రామస్తులు వాసుబాబుకు విన్నవించారు. తక్షణమే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం వాసుబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రతి పక్షాలు అధికారం కోసం రాజకీయాలు చేస్తున్నాయన్నారు. సంక్షేమ పాలనను మెచ్చిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో టీడీపీ, ఇతర పార్టీలకు చరమగీతం పాడతారన్నారు. సర్పంచ్ ఏవూరి భానుదీపిక రాంబాబు, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీ ఆజామ్, గ్రామ పార్టీల అధ్యక్షుడు రామిశెట్టి శ్రీను, పెచ్చెట్టి నాగు, కర్రి శ్రీను, పుచ్చెర్ల బాబూరావు, ఉపసర్పంచ్ కొడుదల సురేష్, నాయకులు జంగం శివ, కూరపాటి రవి, కూరపాటి శ్రీను, కోడూరుపాడు సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు, ఎంపీటీసీ పాల్నాటి శ్రీను, వైసీపీ రైతు విభాగం మండల కన్వీనర్ అన్నేపురెడ్డి నాగరాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ షంషూద్దీన్, హౌసింగ్ ఏఈ సతీష్, ఏపీవో కె.పద్మ, ఏపీఎం సురేష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి



ఎంపీ శ్రీధర్‌ను కలిసిన కన్నం సర్వేశ్వరరావు

దెందులూరు: టీ.నర్సాపురం వైఎస్సార్ సీపీ యువజన విభాగం నూతన మండల అధ్యక్షుడిగా నియమితులైన కన్నం సర్వేశ్వరరావు మంగళవారం ఏలూరు కార్యాలయంలో ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధి, బలోపేతం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయంతో వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీ శ్రీధర్ నూతన మండల యువజన అధ్యక్షుడు సర్వేశ్వరరావుకు సూచించారు.

బాల కార్మికులకు రక్షణగా చట్టాలు



గణపవరంలో షాపులను తనిఖీ చేస్తున్న కార్మికశాఖ సహాయ అధికారులు

గణపవరం: చట్ట ప్రకారం బాలలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హమని, 14 ఏళ్లలోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం, తణుకు కార్మికశాఖ సహాయ అధికారులు గోపికుమార్, కిరణ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కార్మికశాఖ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది గణపవరంలో పలు వ్యాపార సంస్థలు, దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండు సంస్థల్లో పనిచేస్తున్న ఇద్దరు బాల కార్మికులను గుర్తించి సంబంధిత యజమానులపై చట్టప్రకారం చర్యలకు ఉపక్రమించారు. వివిధ దుకాణాలను తనిఖీలు చేశారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పి.తులసి, సూపర్‌వైజర్ చంద్రావతి, గణపవరం హెడ్ కానిస్టేబుల్ రత్నప్రసాద్, నాలుగు సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీసర్వే పూర్తి చేయాలి



గణపవరంలో రీసర్వే పనులపై చర్చిస్తున్న జేసీ రామ్‌సుందరరెడ్డి

గణపవరం: వందేళ్ల తర్వాత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాకరంగా నిర్వహిస్తున్న భూముల రీసర్వే పనులను ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని పశ్చిమగోదావరి జిల్లా జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం గణపవరం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన రెండో విడత రీసర్వేపై రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన గ్రామ మ్యాపులను ఆయన పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని 25 గ్రామాలకు 18 గ్రామాలకు చెందిన గ్రామ పటాలు సర్వే ఆఫ్ ఇండియా నుంచి వచ్చాయని తెలిపారు. గ్రామాల్లో రైతులు, భూయజమానుల సమక్షంలో రీసర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహశీల్దార్ పమ్మి లక్ష్మి, మండల సర్వేయరు రాముడు, డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ సర్వే రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రహదారుల నిర్మాణం



కండ్రిక నర్సింహపురంలో రూ. 2.50 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: రహదారుల అభివృద్ధి, నిర్మాణం, ప్రజాసౌకర్యం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని దీని కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా నిధులు మంజూరు చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఖండ్రికనర్సింహపురంలో సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాలకు దీటుగా గ్రామ శివారు ప్రాంతాల్లో అభివృద్ధి చేశామన్నారు. త్వరలో నియోజకవర్గంలో మిగిలిన రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. మలకచర్ల, కండ్రికనర్సింహపురం, గండివారిగూడెం వాసుల ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉండేలా రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, రామారావుగూడెం సర్పంచ్ పర్వతనేని శ్రావణిసుధీర్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), పార్టీ గ్రామ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, కనికెళ్ళ పెద్దిరాజు, నాయకులు పర్వతనేని నరేంద్ర, ఉపసర్పంచ్ ప్రత్తిపాటి ముకుంద, సరిపల్లి కుటుంబరావు, మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ల మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఉన్నారు.

నీటి ప్రవాహానికి అడ్డంకిగా గుర్రపు డెక్క



ఉంగుటూరు వంతెనవద్ద గుర్రపు డెక్క నీరు ప్రవాహానికి అడ్డుగా ఉన్న దృశ్యం

ఉంగుటూరు: ఏలూరు గోదావరి కాలువపై ఉంగుటూరు మండలం పరిధిలో ఉన్న వంతెనల వద్ద గుర్రపు డెక్క పేరుకుపోయింది. కాలువకు ఇటీవల నీరు విడుదల చేసిన విషయం తెల్సిందే. రైతులు వ్యవసాయ పనులకు, పంచాయతీలు, ప్రజలు మంచినీటి చెరువులు నింపుకోవడానికి నీటి కోసం ఎదురు చూస్తున్నారు. పూర్తిస్థాయిలో కాలువలకు నీటిని ఇరిగేషన్ అధికార్లు విడుదల చేశారు. కాని నీటి ప్రవాహానికి అడ్డంకిగా పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపునకు ఇరిగేషన్ అధికార్లు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఈ కారణంగా గుర్రపు డెక్క వంతెనల వద్ద, కల్వర్టుల వద్ద అండర్ టన్నెల్‌ల వద్ద నిలిచిపోయింది. బాదంపూడి, నాచుగుంట, ఉంగుటూరు, నారాయణపరం, తల్లాపరం, కైకరం వంతెనల వద్ద ఆయా కల్వర్టుల వద్ద ఆగి ఉన్న గుర్రపు డెక్క తొలగించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

శాశ్వత భూ హక్కు, భూరక్షతో వివాదాలకు చెక్



కోడూరుపాడులో మాట్లాడుతున్న భీమడోలు సబ్ రిజిస్ట్రార్ బీఎన్‌వీ శ్రీనివాస్, ఇన్‌చార్జి తహసీల్దార్ షంషూద్దీన్, సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు

భీమడోలు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భీమడోలు సబ్ రిజిస్ట్రార్ బీఎన్‌వీ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం కోడూరుపాడులో జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో స్వమిత్వ గ్రామ కంఠం భూములను రీసర్వే చేసి 25 సర్వే నంబర్లను గ్రామ సచివాలయాల్లో ప్రచురించారు. భూహక్కుదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ బీఎన్‌వీ శ్రీనివాస్, ఇన్‌చార్జి తహసీల్దార్ షంషూద్దీన్ పాల్గొని ప్రసంగించారు. ఉంగుటూరు నియోజకవర్గంలోనే కోడూరుపాడు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అత్యాధునిక పద్ధతుల్లో వ్యవసాయ, వ్యవసాయేతర భూములను సర్వే చేశామన్నారు. గ్రామ కంఠం భూములకు యాజమాన్య హక్కులతో పాటు ప్రజల ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు వారి పేరున పట్టాలు పొందడానికి వీలు కలుగుతుందన్నారు. గ్రామ సచివాలయం స్థాయిలో రిజిస్ట్రేషన్లు చేస్తారన్నారు. తొలుత రైతులు, ప్రజల అనుమానాలను నివృత్తి చేసారు. ప్రతి భూ హక్కుదారుడు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. అనంతరం తుది ప్రచురణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు డి.వెంకట్రావు, వెజ్జు ధర్మా, సర్వేయర్ ఉమాదేవి, సిబ్బంది పీఏఎస్ శర్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూళ్లలో అడ్మిషన్ల వెల్లువ



ఉంగుటూరు హైస్కూల్లో అడ్మిషన్ల కోసం వచ్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు

ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలల్లో తమ చిన్నారులను చేర్పించుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. దాంతో ఆరో తరగతిలో చేరే విద్యార్థులు అడ్మిషన్ల కోసం హైస్కూళ్లకు క్యూ కట్టారు. నాడు-నేడుతో పాఠశాలలు రూపురేఖలు మారడం, ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం, గోరుముద్ద, విద్యాకానుక, అమ్మఒడి తదితర పథకాల సక్రమ అమలును తల్లిదండ్రులు గమనించి ప్రభుత్వ బడుల వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు క్యూ కట్టారు. దీనికి తోడు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించడంతో తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు వచ్చింది. డబ్బులు పోగొట్టుకుని ప్రైవేటు పాఠశాలల్లో చిన్నారులను చేర్పించే కన్నా పిల్లలను తీర్చిదిద్దడంలో ప్రభుత్వం చేస్తున్న కృషి నచ్చి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నట్టు తల్లిదండ్రులు అంటున్నారు. ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు , కైకరం, బాదంపూడి హైస్కూళ్లు, గొల్లగూడెం, రాచూరు హైస్కూళ్లలో విద్యార్థులు గణనీయంగా చేరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పెదవేగి : పెదవేగిలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని విద్యుత్ ఉపకేంద్రం ఎదుట గ్రామస్తులు సోమవారం నిరసన తెలిపారు. దీనిపై స్పందించిన పెదవేగి విద్యుత్ ఉపకేంద్రం ఏఈ నాగేషు మంగళవారం 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో పెదవేగి పాత సొసైటీ కార్యాలయం ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య తొలగనుందని ఏఈ తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఏలూరు (టూటౌన్): స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో స్మార్ట్ సిటీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మానసిక, కుష్టు వ్యాధి, ఇతర పేషెంట్స్‌కు మానసిక వైద్యులు డాక్టర్ సీహెచ్ వంశీ కృష్ణ సమక్షంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ టి.అబ్రహాం లింకన్, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ ఎంజెఎఫ్ ప్రగళ్లపాటి మురళీ కృష్ణలు అందజేశారు. లింకన్ మాట్లాతూ వేసవి కాలంలో రోగుల దాహార్తిని తీర్చేందుకు తమ క్లబ్ ద్వారా వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ జిల్లా మేనేజర్ ఎంజెఎఫ్ వీజీఎంఆర్ కృష్ణారావు, ఉపాధ్యక్షుడు ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు

ఏలూరు టౌన్: చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా చిన్నారులను ప్రోత్సహిస్తూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా మంచి విద్యను అందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏలూరు నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు అర్బన్ ఐసీడీఎస్ పరిధిలో 36, 40, 44 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. మూడేళ్ళునిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలోనూ, ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ బడులు కార్పొరేట్ స్థాయిని సంతరించుకున్నాయని, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులకు పౌష్టికాహారం, మంచి విద్య అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో విమలాదేవి పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

దోమల నిర్మూలనతోనే వ్యాధులు దూరం

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, దోమల నివారణతో వ్యాధులకు దూరంగా, ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సంతోష్‌నాయుడు, తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి గణపవరం మండలం కొత్తపల్లి, గణపవరంలో మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల వ్యాప్తి, నివారణ, వాటి నుంచి రక్షణ తదితర అంశాలపై ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఇళ్ల పరిసరాల్లో ఉన్న మురుగు నీటి కుంటలు తొలగించాలని వివరించారు. డ్రైన్లలో వారానికోసారి కిరోసిన్, ఆయిల్ వంటివి చల్లుకోవాలన్నారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవం

దెందులూరు: గ్రామస్తులందరికీ సురక్షితమైన తాగునీటి లక్ష్యంగా దాతలు ఆర్వో ప్లాంటును నిర్మించడం అభినందనీయమని చల్లచింతలపూడి సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ అన్నారు. మంగళవారం కొత్తకమ్మవారిగూడెంకు చెందిన దాత వాకలపూడి గిరిబాబు రూ. 5 లక్షలు, మాండలీజ్ సంస్థ రూ. 5 లక్షలతో చల్లచింతలపూడిలో నిర్మించిన ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత వాకలపూడి గిరిబాబు సేవాగుణాన్ని సర్పంచ్, అతిథులు అభినందించి సత్కరించారు. మాండలీజ్ మేనేజర్ రామచంద్రన్, రవీంద్రరావు సంస్థ నిబంధనల కనుగుణంగా గ్రామాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాండలీజ్ కంపెనీ ప్రతినిధులు సీహెచ్ బాబు, ఆగ్రో సంస్థ డీఎం సురేష్, రామకృష్ణ, కోకో రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

రాంబాబు నాయక్‌కు వీడ్కోలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతిపై చింతలపూడికి బదిలీపై వెళుతున్న పీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో నార్త్ సెక్షన్ ఏఈ భూక్యా రాంబాబు నాయక్‌కు మంగళవారం ఏలూరులో నార్త్ సెక్షన్ ఉద్యోగులు ఘన వీడ్కోలు పలికారు. ఉద్యోగులు, సిబ్బంది అందరినీ కలుపుకుపోయే మనస్తత్వమున్న రాంబాబు నాయక్ మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు బి.దుర్గా ప్రసాద్ దొర, జీవీ మునిస్వామి, కె.ముసలయ్య, ఎ.రమేష్, ఎ.మణికుమార్, ఎ.నాని బాబు, ఎస్‌కే రహీమ్, బి.ప్రవీణ్, ఎ.రోశయ్య పాల్గొన్నారు.

యువకుల స్వచ్ఛంద రక్తదానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆపదలో ఉన్నవారిని అన్నివిధాలా ఆదుకోవడమే నిజమైన మతమని ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. బిషప్‌గా జయరావు పట్టాభిషేకం పొంది మంగళవారంతో పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్‌లో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీతో కలిపి నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బిషప్ జయరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో ఏలూరు పీఠం యువత విభాగానికి చెందిన యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. యాచకులు, అన్నార్తులకు అన్నదానం చేశారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తాతపూడి ఇమ్మానుయేల్ పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాల్లో ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి.బాల, చాన్సలర్ ఫాదర్ బాబు జార్జ్, ఫాదర్ మద్దుల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను తల్లిదండ్రులకు వివరించాలి



ఎమ్మెల్యే వాసుబాబును కలిసిన ఉపాధ్యాయులు

గణపవరం: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల బదిలీలపై వచ్చిన పలువురు నూతన ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీకి పాఠశాలలకు రావాలని పలువురు హెచ్ఎంలు ఎమ్మెల్యే వాసుబాబును ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో విద్యాసంస్కరణలు అమలు చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో వేల కోట్ల వ్యయంతో మెరుగైన విద్యతోపాటు ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.సబ్జెక్టు నిపుణులైన ఉపాధ్యాయులను నియమించామని ఈ విషయాలను తల్లిదండ్రులకు వివరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. బువ్వనపల్లిలోని ప్రాథమిక పాఠశాలను యూపీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించడంతో స్థానిక విద్యార్థులు గణపవరానికి వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. యూపీ పాఠశాలలో ఈసంవత్సరం 8వ తరగతి ప్రారంభమవుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు ఉన్నత ప్రమాణాల సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే వాసుబాబు సూచించారు.

నేడు ఎనికేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

నిడమర్రు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం (169వ రోజు) అడవికొలను సచివాలయం పరిధిలోని ఎనికేపల్లి పంచాయతీ పరిధిలో బుధవారం ఉదయం 8,15 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని ఆయన తెలిపారు. వైసీపీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సత్యకుమార్ కోరారు.

నేడు మైక్రో వాటర్ పిల్టర్ ప్రారంభం

జలజీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలతో ఎనికేపల్లి గ్రామ మంచినీటి పథకం వద్ద ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ పిల్టర్ పథకాన్ని బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారని ఎనికేపల్లి సర్పంచ్, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్ కుమార్ తెలిపారు.